క్లుప్తంగా

అయ్యప్పస్వామి అన్నసమారాధన ప్రారంభం

జనవరి 7వ తేదీ వరకు కొనసాగింపు



పెనమలూరు: పోరంకిలో శ్రీ వసంత వేణు గోపాలస్వామివారి ఆలయ ప్రాంగణంలో అయ్యప్పస్వామి అన్నప్రసాద కార్యక్రమం శనివారం ప్రారంభించారు. గ్రామంలో గత 14 సంవత్సరాల నుంచి దాతలు, భక్తుల సహకారంతో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ఈ నెల 2వ తేదీ నుంచి జనవరి 7వ తేదీ వరకు అయ్యప్పస్వాములు, భవానీలు, శివస్వాములు, ఇతర మాలధారణ స్వాములకు ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహిస్తారు. కార్యక్రమానికి అందరూ సహకరించాలని భక్త బృందం కోరింది.

పంచామృతాలతో అభిషేకాలు



రామవరప్పాడు: కార్తిక మాసం పురస్కరించుకుని రామవరప్పాడు పిన్నమనేని హైట్స్ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో శనివారం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కందిమళ్ల అంజనీకుమారి, ఆంజనేయులు దంపతుల ఆధ్వర్యంలో శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భాగంగా శివలింగ ప్రతిమను ఏర్పాటు చేసి అర్చకులు మల్లాది సాయి శాస్త్రి ఆధ్వర్యంలో పలు అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

రజక సంక్షేమ సంఘ భవనం ప్రారంభం



పెనమలూరు: తాడిగడపలో శ్రీకాళహస్తీశ్వర రజక సంక్షేమ సంఘంకు చెందిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని శుక్రవారం రాత్రి ప్రారంభించారు. మేడసాని రమేష్‌బాబు తండ్రి దివంగత సీతారామయ్య స్థల దానం చేశారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మేడసాని రమేష్‌బాబు కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, తుమ్మల రామ్‌కుమార్, పారిశ్రామికవేత్త సాగి కృష్ణంరాజు, గ్రామ రజక సంఘ అధ్యక్షుడు కుందేటి సాంబయ్య, పాగోలు రాజేంద్రప్రసాద్, కుందేటి శ్రీనివాసరావు, పెడసనగంటి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

కానూరు రహదారి మరమ్మతులకు శంకుస్థాపన



పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కానూరు ప్రధాన రహదారి మరమ్మతులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.25 లక్షలతో రహదారి మరమ్మతులు చేయనున్నారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ కానూరు రహదారి అభివృద్ధి చేయటానికి నిధులు మంజూరు చేశామన్నారు. రహదారి గుంతలు పడటంతో ఇబ్బందులు తలెత్తడంతో చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, దోనేపూడి రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి



పెనమలూరు: విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని ప్రముఖ రంగస్థల దర్శకుడు, నటుడు, వక్త ఎంసీ దాస్ అన్నారు. పోరంకి భాష్యం బ్లూమ్స్ స్కూల్ స్పోర్ట్స్ మీట్‌లో శనివారం ఆయన ప్రసంగించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, పోరాట పటిమను వెలికి తీయటంలో క్రీడలు దోహదపడతాయని వివరించారు. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాష్యం జెడ్‌ఈవోలు జోషి, వరలక్ష్మి, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యనమలకుదురు వంతెనకు గ్రహణం

- దశాబ్దమైనా పనులు పూర్తి కాని వైనం
- ప్రమాదకర స్థితిలో గ్రామస్తుల ప్రయాణాలు



అసంపూర్తిగా ఉన్న యనమలకుదురు వంతెన

పెనమలూరు: యనమలకుదురు వంతెన పనులు పూర్తి కావడానికి గ్రహణం వెంటాడుతోంది. దశాబ్దం క్రితం శంకుస్థాపన జరిగినా నేటి వరకు వంతెన నిర్మాణం పూర్తి కాలేదు. ప్రమాదకర పరిస్థితిలో ఉన్న వంతెనపై గ్రామస్తులు రాకపోకలు సాగించడం ఆందోళనకరంగా ఉంది. వివరాల్లోకి వెళితే యనమలకుదురు గ్రామం విజయవాడ నగరానికి సమీపంలో ఉంది. గ్రామ జనాభా దాదాపు 60 వేలకు పైగా ఉంటారు. గ్రామస్తులు విజయవాడ నగరానికి రాకపోకలు సాగించటానికి బందరు కాలువ దాటి వెళ్లాల్సి ఉంటుంది. గ్రామంలో బ్రిటీష్ కాలం నాటి కాలం చెల్లిన లాకులు ఉన్నాయి. లాకులపైనే ప్రయాణంతో తరచుగా ట్రాఫిక్ జామ్ అవ్వటంతో 2012వ సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బందరు కాలువపై వంతెన నిర్మించటానికి దాదాపు రూ.7 కోట్ల నిధులు మంజూరు చేసింది. కాంగ్రెస్ పాలనలో వంతెన పనులు చేయక పోవటంతో టీడీపీ అనేక ఆందోళనలు చేసింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మారి 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వంతెన పనులు చేపట్టలేదు. 2019లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయే ముందు వంతెన పనులు అసంపూర్తిగా వదిలేశారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించక పోవటంతో వంతెన పనులు నిలిచి పోయాయి.

కోర్టుకు వెళ్లిన కాంట్రాక్టర్

కాగా తనకు బిలుల్లు చెల్లించలేదని కాంట్రాక్టర్ కోర్టుకు వెళ్లటంతో వంతెన పని పూర్తిగా నిలిచి పోయింది. టీడీపీ పాలనలో బిల్లులు చెల్లించక పోవటం కారణంగా వంతెనకు పూర్తిగా గ్రహణం పట్టుకుంది. అయితే గ్రామస్తుల ఇబ్బందులు చూసి వైఎస్సార్ సీపీ పాలనలో వంతెన అప్రోచ్ వేశారు. కోర్టు వివాదం కారణంగా పనులు ముందుకు సాగలేదు.

పొంచి ఉన్న ప్రమాదం

కాగా వంతెన అప్రోచ్‌లు తాత్కాలికంగా వేయటంతో గ్రామస్తులు వంతెనపై రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన అప్రోచ్‌కు తారు రోడ్డు వేయలేదు. అలాగే రిటైనింగ్ వాల్ నిర్మాణం జరగలేదు. ఎవరైనా వంతెన పైకి వెళ్లే సమయంలో అదుపు తప్పితే రిటైనింగ్ వాల్ లేక నేరుగా బందరు కాలువలో పడి గల్లంతయ్యే ప్రమాదం ఉంది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా వంతెన పూర్తి చేసే ఆలోచన చేయడం లేదు. అభివృద్ధిపై ప్రగల్భాలు పలుకుతున్న కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా వంతెన నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాగులచవితికి ముస్తాబవుతున్న ఆలయం



చోడవరంలో నాగేంద్రస్వామివారి దేవస్థానం

పెనమలూరు: చోడవరం నాగేంద్రస్వామివారి ఆలయంలో నాగుల చవితి పండుగ అత్యంత వైభవంగా చేయటానికి ఏర్పాట్లు చేశారు. నాగులచవితి పండుగ ఈనెల 5వ తేదీ వేకువజామున 3 గంటల నుంచి ప్రారంభమవుతుంది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చోడవరం ఆలయానికి తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ కమిటీ, దాతలు సకల సౌకర్యాలు కల్పించారు.

నాగుల చవితి కార్యక్రమాలు

నాగుల చవితి పండుగ ప్రత్యేక కార్యక్రమాలు ఈ నెల 5వ తేదీ వేకువజామున 3 గంటల నుంచి ప్రారంభమవుతాయి. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు పుట్టలో పాలు పోయటానికి దాతల సాయంతో ఉచితంగా ఆవుపాలు అందజేస్తారు. భక్తులకు ఉచితంగా తీర్థప్రసాదాలు సైతం పంపిణీ చేస్తారు. ఆలయంలో స్వామివారిని భక్తులు దర్శించుకున్న తరువాత అన్నదానం చేస్తారు. భక్తులు స్వామివారిని దర్శించుకోవటానికి పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేకంగా బారికేడ్లు, షామియానాలు, చలువ పందిళ్లు ఏర్పాటుచేశారు. పలువురు దాతల సాయంతో మంచినీరు ప్యాకెట్లు, మజ్జిగ, పులిహోర భక్తులకు అందించనున్నారు

ప్రత్యేక పూజలు..

నాగులచవితి పండుగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని దేవస్థానం ధర్మకర్తలు వేదాంతం నరసింహాచార్యులు, వేదాంతం వెంకట సత్య శ్రీమన్నారాయణ చార్యులు, వేదాంతం శేషయోగానంద్ తెలిపారు. ఈ నెల 5వ తేదీ ఉదయం 3 గంటల నుంచి మంగళ వాయిద్యాలతో శ్రీలక్ష్మీ నారాయణ సహిత శ్రీనాగేంద్రస్వామి వారికి విశేషపూజ, విశేష అలంకరణ చేస్తారు. స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, మంత్రపుష్పం, తదితర పూజా కార్యక్రమాలు చేస్తామన్నారు. ఉదయం 5 నుంచి 11 గంటల వరకు భజన బృందం వారు భజనలు చేస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం నిర్వహిస్తారు.

ప్రత్యేక బస్సులు..

చోడవరంలో నాగుల చవితి పండుగ సందర్భంగా భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఈ నెల 5వ తేదీ వేకువజామున 3 గంటల నుంచి విజయవాడ, పెనమలూరు సెంటర్ నుంచి ఆలయం వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు తిరగటానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తుకు చర్యలు తీసుకున్నారు. వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ కేటాయించారు.

శివాలయాల్లో కార్తిక మాసం పూజలు ప్రారంభం



చినకంచి శివాలయంలో అభిషేకం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని చినకంచి దేవాలయంలో శనివారం కార్తిక మా సోత్సవాలు ప్రారంభమయ్యాయి. శివునికి అభిషేకాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు తెల్లవారు జాము నుంచి స్వామి వారిని దర్శించుకున్నారు.దేవదాయ శాఖకు చెందిన నున్న గ్రామంలోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కార్తికమాసం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహిళలు తెల్లవారు జామునుంచి దీపారాధనలు, స్వామికి అభిషేకాలు చేశారు. పాతపాడు గ్రామంలోని శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానంలో స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. పి.నైనవరం గ్రామంలోని శ్రీశివనాగేంద్రస్వామి దేవస్థానంలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు.

మున్సిపల్ కార్యాలయానికి అద్దెకు భవనం కావాలి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయం ఏర్పాటుకు అద్దె భవనం కావాలని కమిషనర్ భవానీప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం ఒక ప్రకటనలో వివరాలు తెలుపుతూ ప్రస్తుతం పోరంకిలో ఉన్న కార్యాలయం భవనం సరిపోనందున అద్దె భవనం అవసరం ఏర్పడిందని తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయానికి 8 వేల నుంచి 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన భవనం అద్దె ప్రాతిపదికన కావాలన్నారు. ఆసక్తి కలిగిన భవన యజమానులు మున్సిపాలిటీ కార్యాలయంలో వివరాలు తెలపాలని సూచించారు.

శ్రీవెంకటేశ్వరస్వామివారి ఆలయంలో కార్తిక పూజలు

పెనమలూరు: పోరంకి శ్రీ లక్ష్మీపురం కాలనీలో ఉన్న శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో కార్తికమాస పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. కార్తికమాసం నెల రోజులు భక్తుల గోత్ర నామార్చన జరుపుతామని కమిటీ తెలిపింది. ఈ నెల 12, 15, 26 తేదీల్లో ఉదయం 10 గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఉంటాయన్నారు. ఈ నెల 15వ తేదీన సహస్ర దీపాలంకరణ ఉంటుంది. ఈ నెల 23వ తేదీన ఉదయం 9.30 గంటలకు స్వామివారు, అమ్మవార్ల వస్త్రాలు వేలం పాట నిర్వహిస్తారు.

ముక్తేశ్వరాలయంలో కార్తికమాస పూజలు ఆరంభం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని పంచాయతన క్షేత్రమైన ముక్తికాంత సమేత ముక్తేశ్వరస్వామి దేవస్థానంలో కార్తికమాస అర్చనలు శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీప ప్రజ్వలనతో కార్తికమాస పూజలకు శ్రీకారం చుట్టారు. పరమేశ్వరునికి ప్రత్యేక అలంకరణతో వి శేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి ఆకాశదీపం పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు నండూరి సత్య వెంకటేశ్వర శర్మ, నక్కా బాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

విజయవాడరూరల్: ప్రజల నుంచి వచ్చిన వివిధ రకాల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా వీఆర్వోలు పని చేయాలని విజయవాడ రూరల్ మండల తహసీల్దారు బి.సుగుణ అన్నారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉంటే ప్రభుత్వం నుంచి సీరియస్ యాక్షన్ ఉంటుందని హెచ్చరించారు. ఈ నెలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేయాలన్నారు. చెరువులు, కాల్వల ఆయకట్టు పరిధిలోని రైతుల వివరాలను సేకరించడంలో నిబంధనలు పాటించాలన్నారు. బీఎల్‌ఓలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా తయారీకి అర్హత గల వారిని గుర్తించి వారి వివరాలతో జాబితాలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీటీ బేబిరాణి, వీఆర్వోలు పాల్గొన్నారు.

నాణ్యత లోపించిన మధ్యాహ్న భోజన పథకం

మండల సర్వసభ్య సమావేశంలో పలువురి ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రవి

గన్నవరం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నాణ్యత లోపించిందని మండల పరిషత్ సమావేశంలో పలువురు సభ్యులు ఆరోపించారు. ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సభలో పలువురు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నాణ్యతగా లేకపోవడంతో పలువురు విద్యార్థులు ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకుని తింటున్నారని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ శాఖల వారీగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపించడం కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. మధ్యాహ్న భోజనం కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం, ఇతర సరుకులు పక్కదారి పడుతున్నాయని టీడీపీ ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. వచ్చే ఏడాది మార్చి 15 నాటికి ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలు పూర్తికాకపోతే రద్దు చేస్తామని గృహ నిర్మాణ శాఖ అధికారులు చెప్పడంపై ప్రజాప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసరపల్లిలో లేఅవుట్‌కు వంతెన నిర్మాణం చేయకపోవడం వల్ల గృహ నిర్మాణాలు చేసుకునేందుకు లబ్ధిదారులు ముందుకురావడం లేదని సర్పంచి చేబ్రోలు లక్ష్మీమానిక తెలిపారు. కొన్ని లేఅవుట్లలో కనీస సదుపాయాలు లేవని, మరికొంతమందికి ప్లాట్లు కేటాయించినా ఇంత వరకు స్థలాలు చూపించలేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. ఇంకా అజ్జంపూడి, బూతుమిల్లిపాడు, సూరంపల్లిలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించాలని, పలు గ్రామాల్లో జలజీవన్ మిషన్ కింద వాటర్ పైపులైన్లు, కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. ఎంపీపీ అనగాని రవి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైస్ ఎంపీపీలు కొమ్మరాజు సుధీర్, కాలగడ్డ శివనాగరాజకుమారి, తహసీల్దారు కె.వెంకటశివయ్య, ఎంపీడీఓ టి.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు సీహెచ్‌సీ చైర్‌పర్సన్‌గా బోడె ప్రసాద్

కంకిపాడు: కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్‌గా పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఖరారయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అభివృద్ధి కమిటీ సభ్యులుగా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, సభ్యులుగా చలవాది రాజా గురవయ్య, గరికపాటి రవి కిషోర్, మెంబర్ కన్వీనర్‌గా కంకిపాడు సీహెచ్‌సీ వైద్యాధికారి, సభ్యులుగా బోయిన రోహిణి కుమారి, పునాదిపాడు పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓలు నియమితులయ్యారు. ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్యే బోడె ప్రసాద్, సభ్యులుగా ఎంపీ వల్లభనేని బాలశౌరి, మండవ జయదేవ్, గోపరాజు వినయకుమార్, మెంబర్ కన్వీనర్‌గా ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి, సభ్యులుగా బండి మాణిక్యం, ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్, ఉయ్యూరు ఎంపీడీఓ సభ్యులుగా నియమితులయ్యారు.

మినుము పైరులో యాజమాన్య చర్యలు



మినుము పైరును పరిశీలిస్తున్న డాక్టర్ డి.సుధారాణి

కంకిపాడు/పెనమలూరు : మినుము పైరులో యాజమాన్య చర్యలు తీసుకోవాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్ర కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి సూచించారు. మండలంలోని కంకిపాడు, గొడవర్రు, మద్దూరు, చలివేంద్రపాలెం గ్రామాల్లో శనివారం ఆమె విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా మినుము పంటలో పొగాకు లద్దె పురుగు ఉన్నట్లు గుర్తించారు. పంట కాలం సమీపిస్తున్నా పూత, పిందె దశకు చేరుకోకపోవటంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పూత, పిందె లేకపోవటంతో అధికంగా రసాయనాలు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. పెట్టుబడులు అధికంగా పెట్టవద్దని డాక్టర్ డి.సుధారాణి సూచించారు. మినుములో పొగాకు లద్దె పురుగు ఉందని, పురుగు నివారణకు వేప గింజల కషాయం 5 శాతం వినియోగించాలన్నారు. వ్యవసాయశాఖ సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

గ్రామసభలో 14 దరఖాస్తులు

పి.నైనవరం(విజయవాడరూరల్): పి.నైనవరం గ్రామంలో శనివారం జరిగిన రీ సర్వే గ్రామసభలో ప్రజల నుంచి 14 దరఖాస్తులు వచ్చాయి. ఆర్‌ఓఆర్ వన్ బీ లో మార్పు చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేయాలని కోరుతూ కొందరు రైతులు గ్రామసభలో దరఖాస్తులు అందజేశారు. రీసర్వేలో కొలతలు మళ్లీ చేయాలని పలువురు దరఖాస్తు చేశారు. దరఖాస్తుల్లో సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపడతామని సర్వేయర్ జనార్దనరావు తెలియజేశారు. గ్రామసభకు గ్రామ సర్పంచి బట్టా సోమయ్య అధ్యక్షత వహించారు. వీఆర్వో, విలేజి సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు బాపులపాడు విద్యార్థులు



ఉమ్మడి కృష్ణాజిల్లా అండర్-19 నెట్‌బాల్ జట్లకు ఎంపికైన విద్యార్థులతో వ్యాయామోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నెట్‌బాల్ పోటీలకు బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు తెలిపారు. విజయవాడలోని మేరిస్ స్టెల్లా కాలేజీలో శనివారం జరిగిన అండర్-19 నెట్‌బాల్ ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టు ఎంపికలో బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చినట్లు చెప్పారు. బాలుర అండర్-19 నెట్‌బాల్ జట్టుకు షేక్ హనీఫ్ ఎంపిక కాగా, బాలికల అండర్-19 జట్టుకు నాగెళ్ల కవిత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు వివరించారు. ఈ నెల 8వ తేదీన నెల్లూరులో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఈ విద్యార్థులు ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, వ్యాయామోపాధ్యాయుడు పామర్తి వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జెడ్పీ విద్యార్థినులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయినులు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థినులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు దుగ్గిరాల ఝాన్సీ తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం పాఠశాలలో విద్యార్థినులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థిని జి.లోచన రాష్ట్రస్థాయి అండర్-17 సైక్లింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. 9వ తరగతి విద్యార్థిని మానికొండ సాయిసత్య చిన్మయి రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ (అండర్-14) పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జమ్ము కాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు చిన్మయిని ఎంపిక చేసినట్లు వివరించారు. అనంతరం ఎంపికైన విద్యార్థినిలతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయినులు కె.గీత, జి.కృష్ణప్రియను హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

జనగణన సమర్థంగా జరగాలి

కంకిపాడు: జనగణన సమర్థంగా జరగాలని నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా కోరారు. ఈడుపుగల్లులోని సంఘ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చిన్నా మాట్లాడుతూ త్వరలో కుల గణన, జనగణన జరగనుందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారి వివరాలను నమోదు చేయాలన్నారు. సామాజిక వర్గాలకు న్యాయం జరిగేలా గణన జరగాలన్నారు. కులగణన సమర్థంగా సాగాలని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: పోరంకిలో బాలిక అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పోరంకి సీతాపురం కాలనీకి చెందిన బాలిక (16) ఆత్కూరు ఎంజీఎం కాలేజీలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతూ దావూజీగూడెంలో హాస్టల్‌లో ఉంటోంది. హాస్టల్ మరమ్మతుల కారణంగా ఆమె పోరంకి ఇంటి వద్ద నుంచే కాలేజీకి వెళుతోంది. దీపావళి పండుగ రోజు కాలేజీ వద్దకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే ఆమె సాయంత్రం ఇంటికి రాక పోవటంతో కాలేజీకి, హాస్టల్‌కు బాలిక తల్లి ఫోన్ చేయగా బాలిక రాలేదని యాజమాన్యం తెలిపింది. దీంతో బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసినా ఆచూకీ తెలియకపోవటంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపటినుంచి గన్నవరం-ఉయ్యూరు బస్ సర్వీస్ ప్రారంభం

గన్నవరం: ఈ నెల 4వ తేదీ నుంచి ఉయ్యూరు-గన్నవరం మధ్య నూతన బస్ సర్వీస్(రూట్ నంబర్ 242)ను ప్రారంభిస్తున్నట్లు గన్నవరం డిపో మేనేజర్ పి.శివాజీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 7.55 గంటలకు బస్సు గన్నవరం నుంచి బయలుదేరి కేసరపల్లి, అజ్జంపూడి, బుద్ధవరం, బూతుమిల్లిపాడు, తరిగొప్పుల, మానికొండ, కలవపాముల, కాటూరు, కడవకొల్లు మీదుగా 9.25 గంటలకు ఉయ్యూరు చేరుకుంటుందన్నారు. తిరిగి 9.35కు బయలుదేరి 11.05 గంటలకు గన్నవరం చేరుకుంటుందన్నారు. మళ్లీ సాయంత్రం 4.10కు గన్నవరం నుంచి బయలుదేరి 5.40కు ఉయ్యూరు చేరుకుని, తిరిగి 5.50కు బయలుదేరి రాత్రి 7.20కు గన్నవరం చేరుకుంటుందని తెలిపారు. ఈ సర్వీస్‌లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆక్రమణల తొలగింపు వివాదాస్పదం



స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్ భావన్నారాయణ

కంకిపాడు: రోడ్డు పోరంబోకు స్థలంలో నిర్మించుకున్న ఇళ్ల తొలగింపు ప్రక్రియ వివాదాస్పదం అయింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని నెప్పల్లి గ్రామంలో ఆర్‌అండ్‌బీ స్థలంలో 11మంది షెడ్లు నిర్మించుకున్నారు. వీరిలో కేవలం ఇద్దరు మాత్రమే నివాసం ఉంటుండగా మిగిలిన వారు పశువుల షెడ్లను ఏర్పాటుచేసుకోగా, వారికి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆక్రమణల తొలగింపునకు అధికారులు శనివారం చర్యలు తీసుకున్నారు. ఈ విషయమై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కొద్దిసేపు అధికారులు, స్థానిక నేతల మధ్య వాగ్వాదం జరిగింది. తహసీల్దార్ వి.భావన్నారాయణ చొరవ తీసుకుని స్థానికులతో సంప్రదింపులు జరిపి ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.

కేసరపల్లిలో సకల మృతుల స్మరణ కార్యక్రమం



దివ్యబలిపూజ జరుపుతున్న ఫాదర్లు

కేసరపల్లి(గన్నవరం): మండలంలో కేసరపల్లి ఎస్సీ కాలనీలోని క్రైస్తవ శ్మశానవాటికలో శనివారం సకల మృతుల స్మరణ (సమాధుల పండుగ)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ మేత్రాసన పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇ.విజయరాజు, కేసరపల్లి ఆర్‌సీఎం విచారణకర్తలు ఫాదర్ ఎస్.కిషోర్ నేతృత్వంలో దివ్యబలిపూజ నిర్వహించారు. తొలుత మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. విచారణ పరిధిలోని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మరణించిన వారి సమాధులను పూలతో అలంకరించి కొవ్వొత్తులను వెలిగించారు. గన్నవరం, అజ్జంపూడి, దావాజీగూడెం గ్రామాల్లో కూడా సమాధుల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.